క్లుప్తంగా

సుభద్రంపేట వీఆర్ఏ మృతి



కూసి సత్తియ్య (ఫైల్)

రంగంపేట: సుభద్రంపేట గ్రామ వీఆర్ఏ కూసి సత్తియ్య (85) గురువారం రాత్రి మృతి చెందారు. శుక్రవారం సత్తియ్య భౌతిక కాయం వద్ద తహసీల్దార్ ఎం.దొరకయ్య, వీఆర్ఏల అసోసియేషన్ అధ్యక్షుడు పి.సుదర్శన రావు, రెవెన్యూ సహాయకులు నివాళులు అర్పించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తహసీల్దార్ అందించారు.

డివైడర్ పైకి నాన్‌స్టాప్ బస్సు



ఘటనా స్థలంలో నాన్‌స్టాప్ బస్సు

రాజానగరం: రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళుతున్న నాన్ స్టాప్ ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై దత్త ఆశ్రమం వద్ద శుక్రవారం సాయంత్రం అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకుపోయింది. ముందు టైరు పంక్చరవ్వడంతో ఈ ప్రమాదంలో జరిగింది. ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. డివైడర్ పైకి ఎక్కి ఆగిపోవడంతో ఎవరికీ ఏవిధమైన ప్రమాదం జరగలేదు. ప్రయాణికులను వేరొక బస్సులో గమ్యస్థానానికి పంపించారు. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోరగా.. టైరు పంక్చరవ్వడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. బస్సులోని ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని తెలిపారు.

బాధిత కుటుంబాలకు సాయం



బాధిత కుటుంబానికి సరకులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: వెదుళ్లపల్లిలోని మూడు బాధిత కుటుంబాలకు ఆదివారం జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయ సంజీవని కార్యక్రమంలో బియ్యం, రూ.రెండు వేలు విలువైన నిత్యావసరాల కిట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు త్రిమూర్తులు, తన్నీరు రామకృష్ణ, తన్నీరు వెంకటేశ్వరరావు, నల్లమోలు లక్ష్మణ్, చిక్కిరెడ్డి జోగారావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఝాష్వా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్టు గోకవరం హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే...వీరలంకపల్లి గ్రామానికి చెందిన కర్రి సాంబమూర్తి తాపీ పనికి వెళ్లి మోటారు సైకిల్‌పై వస్తుండగా వీరలంకపల్లి శివారు బురద కాలువ వంతెన వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాంబమూర్తిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భాస్కరరావు తెలిపారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

ధవళేశ్వరం: మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు సర్వనాశనం అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. ధవళేశ్వరం వివేకానంద ఐటీఐలో శుక్రవారం న్యాయ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణ, మాదకద్రవ్యాల బాధితులకు న్యాయ సేవలు, మాదక ద్రవ్యాల నిషేధం 2015 పథకంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రత్యూష కుమారి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎదురయ్యే దుష్ప్రభావాలను వివరించారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్నా చట్టపరంగా శిక్షార్హులవుతారన్నారు. చుట్టుపక్కల అనుమానాస్పద చర్యలు జరిగితే వాటికి దూరంగా ఉండటంతో పాటు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

నివేదికపై చర్యలు తీసుకోండి

ప్రకాశం నగర్: ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిరణ్ రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించి, అందజేసిన నివేదికపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణకిరణ్, జాయింట్ కలెక్టర్ శుక్రవారం తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఆహార భద్రత అమలు జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో రెండు రోజులు పరిశీలించి, నివేదిక ఇచ్చారన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, మొబైల్ డెలివరీ యూనిట్ వాహనాల ద్వారా జరుగుతున్న నిత్యావసరాల పంపిణీ, రెండు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీరుపై లోపాలను గుర్తించి నివేదిక రూపొందించారన్నారు. కృష్ణకిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆహార భద్రత విషయంలో అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటూ పౌష్టిక విలువలు కలిగిన బియ్యం, ఇతర నిత్యావసరాలను అందిస్తోందన్నారు.

ముంపు తగ్గినా.. నష్టాల ముప్పే

- పొలాలు, తోటలను ముంచేసిన వరద
- నీరు లాగినా మొక్కలు కుళ్లిపోయే పరిస్థితి
- ఆవేదనలో అన్నదాతలు



వంగలపూడిలో ముంపుబారిన దొండపాదులు

సీతానగరం: అఖండ గోదావరి వరద ఉధృతితో పంట పొలాలు ముంపులోకి వెళ్లాయి. ముఖ్యంగా లంక భూమిలో వేసిన పంటలను వరద ముంచెత్తింది. రెండు రోజుల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. అయితే పొలాల్లోని నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిలిచిపోయింది. దీంతో అవి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. సీతానగరం, సింగవరం, రఘుదేవపురం, రామచంద్రపురం, ముగ్గళ్ల, కాటవరం, జాలిమూడి, ములకల్లంకల్లోని లంకభూముల్లో సుమారు 500 ఎకరాల్లో వేసిన వివిధ రకాల పంటలు మునిగిపోయాయి. అలాగే కొండ గోదావరి ఎగపోటుతో మిర్తిపాడు, ఉండేశ్వరపురం, నల్గొండ, రాపాక, రఘుదేవపురం, చినకొండేపూడి, వంగలపూడి, వెదుళ్లపల్లి గ్రామాలలోని సుమారు 2,500 ఎకరాల వరి పొలాలు నీటమునిగాయి.

తేరుకోని రైతులు

లంక భూములలోని అరటి, బొప్పాయి, కూరగాయలు, పాదులు వరద నీటిలో మునిగాయి. ముంపునీరు లాగేసినప్పటికీ, బొప్పాయి మొక్కల మొదళ్లు కుళ్లిపోయి పడిపోతాయని రైతులు చెబుతున్నారు. అలాగే కాకర, బీర, దొండ పాదులు ముంపులోకి వెళ్లి, నీరు నిల్వ ఉండిపోవడంతో ఎర్రబారి ఎదుగుదల ఆగిపోతాయి. వాటి నుంచి కూరగాయలు తయారు కావని చెబుతున్నారు. పామాయిల్ తోటలు కూడా తేరుకోవడానికి చాలా సమయం పడుతుంది. ముఖ్యంగా పొలాల నుంచి నీరు బయటకు వెళ్లడానికి మార్గం కోసం రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎకరానికి శిస్తు రూ. 50 వేలు చెల్లించి, పెట్టుబడిగా మరో రూ.30 వేల నుంచి రూ.50 వేలు పెట్టామని రైతులు తెలిపారు. అయితే వరద కారణంగా పంటలు మునిగి నష్టాలపాలయ్యామని వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ముంపుబారిన 22 ఎకరాలు



దొండపాదులు 8, కాకర పాదులు 2, అరటి తోటలు 12 ఎకరాల్లో సాగు చేశారు. అంతా కౌలు పొలమే. రూ. లక్షల తెచ్చి పెట్టుబడి పెట్టాను. గోదావరి వరద నీరు వచ్చి పంటలను ముంచింది. పాదులు, కూరగాయల మొక్కలు కుళ్లిపోయాయి. అరటి కూడా పాడైపోతోంది. నీరు ఇంకా లా గలేదు. పాదులు ఎందుకు పనికిరాకుండా పోతాయి. శిస్తు, పెట్టుబడి కలిపి రూ.30 లక్షలు ఖర్చు చేశారు. ఒక్కపైసా చేతికి రాదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– దాసరి కోటేశ్వరరావు, కౌలురైతు, రఘుదేవపురం

నష్టపోయాను



వేసిన అరటితోట పొట్టపై ఉంది. కొన్ని రోజులు గడిచి ఉంటే గెలలు వేసేవి. ఎకరం అరటితోటకు రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టాను. గోదావరి వరదతో తోట మునిగిపోయింది. నీరు బయటకు వెళ్లడానికి దారి లేదు. నీరు ఆరిన తర్వాత అరటి తోట ఎందుకు పనికిరాకుండా పోతుంది. తిరిగి మళ్లీ వేసుకోవాలి. పెట్టిన పెట్టుబడి అంతా పోయింది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– సాంబేలపు బాలయోగి, రైతు, రఘుదేవపురం

మొక్కల సంరక్షణ చర్యలు ప్రశంసనీయం



మొక్క నాటుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: కొప్పవరంలో రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి వాటి సంరక్షణను సర్పంచ్ కర్రి బుల్లి మోహన్‌రెడ్డి బాధ్యతగా తీసుకున్న తీరు ప్రశంసనీయమని ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. ఈ పంచాయతీ పరిధిలో నాలుగో విడత మొక్కలు నాటే కార్యక్రమాన్ని కృష్ణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరివిగా మొక్కలు నాటడంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. గ్రామాల పరిధిలో కొబ్బరి, మామిడి వంటి ఫలసాయాన్ని ఇచ్చే మొక్కలు నాటడం వల్ల భవిష్యత్‌లో ఆయా పంచాయతీలకు ఆదాయ వనరులుగా మారతాయన్నారు. కొప్పవరం పంచాయతీకి కడియం సత్యదేవ నర్సరీ అధినేత పుల్లా సత్యనారాయణ సుమారు రూ.10 వేల విలువైన కొబ్బరి మొక్కలు ఉచితంగా అందించారని అన్నారు. అనంతరం గ్రామంలో కాలువ గట్టు వద్ద మొక్కలు నాటారు. సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తాడి వెంకట రామకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ మల్లిడి వీరరాఘవరెడ్డి, కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఊలపల్లిలో గడప గడపకూ..



ఊలపల్లిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఊలపల్లిలో మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో పేదలు, మధ్యతరగతి ప్రజల కష్టాలను తెలుసుకుని వారికి ఉపయోగపడే విధంగా సంక్షేమ పథకాలను రూపొందించారని చెప్పారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే తిరిగి ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకుందామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పరాభవం తప్పదన్నారు. అనంతరం గ్రామంలో రూ.12.50 లక్షలతో నిర్మించిన మార్కెట్ షెడ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు రమ్య, వైస్ ఎంపీపీ పెంకె మంగాయ్యమ్మ, ఎంపీటీసీ బండారు శివ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పందలపాక సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, కొంకుదురు సర్పంచ్ సత్తి వీరమణి పాల్గొన్నారు.

గర్భిణులకు సంపూర్ణ పౌష్టికాహారం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- టేక్ హోం రేషన్ సరకుల పంపిణీ ప్రారంభం



గర్భిణికి టేక్ హోం రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పోషకాహారాన్ని అందించడం ద్వారా వారిలో రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రాముడమ్మపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ సరకుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ ప్లస్ పథకాలు గర్భిణులు, బాలింతలకు ఓ వరమని అన్నారు. సరకులు తీసుకెళ్లేందుకు బాలింతలు రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులు గమనించిన ప్రభుత్వం టేక్ హోం రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషణ కిట్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇదిలా ఉండగా తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, ఐసీడీఎస్ సీడీపీఓ జెస్సీ ఫ్లోరెన్స్, సూపర్‌వైజర్ ఆర్.ఛాయాదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాదూరి డేవిడ్‌రాజు, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, ఎం.విజయకుమారి, కోనాల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కోరుకొండ సొసైటీకి ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ తేజో వీరన్న నాయుడు, సీఈఓ సుధాకరవర్మ

మధురపూడి: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోరుకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఉత్తమ సొసైటీ అవార్డును సాధించింది. అమరావతిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి చేతుల మీదుగా కోరుకొండ సొసైటీ చైర్ పర్సన్ మారిశెట్టి తేజో వీరన్న నాయుడు, సీఈఓ గొట్టుముక్కల సుధాకర వర్మ అవార్డును అందుకున్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన సొసైటీల్లో ఇది ప్రథమస్థానం సాధించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 298 సంఘాల్లో కోరుకొండకు ప్రథమస్థానం దక్కింది. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఈసీఓ నరసింహరావు పాల్గొన్నారు.

455 మందికి వైద్యసేవలు



రాపాకలో ఇంటి వద్ద ఉన్న రోగికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని రాపాక గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 455 మందికి సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. ఇంటి వద్ద ఉన్న రోగులకు వైద్య పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బాలింతలు, గర్భిణులు, పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి, ఇళ్ల వద్ద నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎం రోజా, ఆశావర్కర్లు పాయి, లక్ష్మి, కుమారి పాల్గొన్నారు

శ్మశాన వాటికలో తుప్పల తొలగింపు



శ్మశాన వాటికను శుభ్రం చేస్తున్న దళిత యువకులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని శ్మశాన వాటికను శుక్రవారం యువత శుభ్రం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు శ్మశాన వాటికలో తుప్పలు, పిచ్చిమొక్కలు బాగా పెరిగిపోయాయి. దీంతో అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళలో ఇది మరింత సమస్యగా ఉంది. దీంతో దళిత యువకులందరూ సమావేశమై, శ్మశాన వాటికను శుభ్రం చేయాలని నిర్ణయించారు. ఏడిద పండు, పిల్లి క్రాంతి, కుండేటి కిషోర్, ఉప్పాటి నాగేంద్ర, గెడ్డం బొన్ని, కొడమంచిలి భరత్, మోర్త పండు, పలివెల బొన్ని శ్రమదానం చేశారు.

భూరక్ష సర్వే వేగవంతం చేయండి



ఏపీత్రయంలో రీసర్వేపై రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుభాష్

పెదపూడి: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ టి.సుభాష్ సూచించారు. ఏపీత్రయం, రామేశ్వరం గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అధికారులు రీసర్వే చేపట్టాలన్నారు. గ్రామాల్లో రీసర్వే చేసే ముందు రైతులకు సమాచారం, నోటీసులు ఇవ్వాలన్నారు. భూముల విలువ, ఓఆర్ఎస్ మ్యాప్‌లు సిద్ధం చేయాలన్నారు. దీనికి రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు ఇది చక్కని పరిష్కారం చూపుతుందన్నారు. మండలంలోని 11 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యిందన్నారు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాల్లో రీసర్వే జరుగుతుందన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారెడ్డి, సర్వేయర్ సత్యనారాయణమూర్తి, ఆర్ఐ త్రివేణి, వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, కర్లెడ్ల రమేష్, సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవీచౌక్ ఆలయానికి భక్తుల తాకిడి

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్ శర్మ విశేష అలంకరణ చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు చేసుకునే మహిళలకు హైదరాబాద్‌కు చెందిన కంబాల శ్రీనివాస్‌రావు దంపతులు బంగారు వరలక్ష్మి పేరుతో లక్కీడిప్ ద్వారా 50 మందికి బంగారు రూపులు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. దీంతో విశేష సంఖ్యలో మహిళలు వ్రతాలు చేసుకునేందుకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రచార సారథుల నియామకం



కుండేటి ప్రసాద్



ఇందుగుమిల్లి సత్యనారాయణ



ముదునూరి రామకృష్ణంరాజు

రాజానగరం: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను, విమర్శలను అదే స్థాయిలో తిప్పికొట్టాలన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు వైఎస్సార్ సీపీ ప్రచార సారథులను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, వారికి అవగాహన కల్పించాలన్నారు. రాజానగరం మండలానికి కుండేటి ప్రసాద్, కోరుకొండకు ఇందుగుమిల్లి సత్యనారాయణ, సీతానగరానికి ముదునూరి రామకృష్ణంరాజులను నియమించారు.

సుప్రీంకోర్టు స్టేపై హర్షం

సీతానగరం: పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు విధించిన జైలుశిక్షపై సుప్రీం కోర్టు స్టే విధించడంపై రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిల శేషగిరి హర్షం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చివరకు సత్యమే గెలిచిందన్నారు.

వైద్య శిబిరం

రాజానగరం: ది గ్రేస్ మిషన్ ఆధ్వర్యంలో మండలంలోని పాలచర్లలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు వంద మంది రోగులకు డాక్టర్ పేపకాయల బాల మాణిక్యంబ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కె.సురేష్‌కుమార్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాస్టర్ అవినాష్, రమణ, దైవకృప, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ వేమగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంక్షేమానికి కృషి



ముగ్గళ్లలో కిట్లు అందజేస్తున్న ఎంపీపీ జ్యోత్స్న



మల్లిపూడిలో కిట్లు అందుకున్న గర్భిణులు, బాలింతలు

రంగంపేట: మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు అన్నారు. మల్లిపూడిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద సర్పంచ్ వేము మాధవి అధ్యక్షతన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. పార్టీ గ్రామ కన్వీనర్ వేము చిరంజీవి, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ

సీతానగరం: బాలింతలు, గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తోందని జిల్లా ఎంపీపీ సంఘం అధ్యక్షురాలు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. ముగ్గళ్లలోని అంగన్‌వాడీ కేంద్రం 2లో అంగన్‌వాడీ టీచర్ మార్లపూడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకవల్లి సుబ్రహ్మణ్యం, కూచిపూడి బాబ్జీ, సాదె చంటిబాబు, రుద్రం వీరేంద్ర, గుర్రాల స్వామి పాల్గొన్నారు.

వీసీ పద్మరాజును కలిసిన ఎన్‌సీసీ అధికారులు



వీసీ ఆచార్య పద్మరాజుతో మాట్లాడుతున్న ఎన్‌సీసీ అధికారులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎన్‌సీసీ స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ నిర్వహించేందుకు వీసీ ఆచార్య కె.పద్మరాజును శ్రీ ఆంధ్ర గరల్స్ బెటాలియన్, ఎన్‌సీసీ కాకినాడ అధికారులు లెఫ్టినెంట్ కర్నల్ దుష్యంత్ కులశ్రేష్ఠ, సుబేదార్ మేజర్ మహ్మద్ అఫ్రాష్ ఖాన్, నాయబ్ సుబేదార్ శుక్రవారం కలిశారు. పది రోజుల పాటు జరిగే ఈ క్యాంపునకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్‌సీసీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. వారి విజ్ఞాపనకు సానుకూలంగా స్పందించిన వీసీ ఆచార్య పద్మరాజు నన్నయ వర్సిటీలో కూడా ఎన్‌సీసీ యూనిట్‌ని ఏర్పాటు చేయాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ కూడా ఉన్నారు.

నన్నయలో హాస్టల్ విద్యార్థుల ఆందోళన



నన్నయ వర్సిటీలో ఆందోళన చేస్తున్న హాస్టల్ విద్యార్థులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులు శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ ఆందోళన చేశారు. సమస్యల పరిష్కారంలో హామీలు ఇవ్వడమేగాని, ఆచరణలో అధికారులు శ్రద్ధ చూపడం లేదంటూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) యూనివర్సిటీ సెక్రటరీ గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. క్యాంపస్‌లోని బాలుర, బాలికల హాస్టళ్లలో రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేకపోయినా పట్టించుకున్ననాథుడు లేడన్నారు. తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ముఖ్యంగా హాస్టల్ విద్యార్థులు ప్రతిరోజూ సమస్యలతో అవస్థలు పడుతున్నారన్నారు. యూనివర్సిటీ అధ్యక్షుడు తరుణ్, జిల్లా కన్వీనర్ సాయివెంకటేష్, విభాగ్ కన్వీనర్ సత్యసాయి, తదితరులు పాల్గొన్నారు.